రైతు రుణమాఫీ అమలుకు పకడ్బందీ చర్యలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో బ్యాంకర్లతో సమావేశం

- రైతులకు ఇబ్బంది లేకుండా జిల్లా కేంద్రాలతోపాటు అన్ని బ్యాంకుల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాట్లు
- రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు శశాంక, ప్రతీక్‌జైన్

రంగారెడ్డి, జూలై 18 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ అమలుకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు రంగారెడ్డి కలెక్టర్ శశాంక తెలిపారు. గురువారం రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ శశాంక వ్యవసాయ, సహకార, బ్యాంకర్లతో రైతు రుణమాఫీ పథకం అమలులో తీసుకోవలసిన చర్యలపై డీసీసీ-డీఎల్ఆర్‌సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ పథకం స్వల్పకాలిక పంట రుణాలకు 2018, డిసెంబర్ 12 లేదా ఆ తర్వాత మంజూరైన లేక రెన్యువల్ అయిన రుణాలకు, 2023 డిసెంబర్ 9 నాటికి బకాయి ఉన్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. మొదటి విడత రూ.లక్ష వరకు, రెండో విడత రూ.1.50లక్ష వరకు, మూడో విడత రూ.2లక్షల వరకు దశలవారీగా రుణమాఫీ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలో 49,741 మంది రైతులకు లక్షలోపు రుణ మాఫీ ద్వారా రూ.278.06 కోట్లు చెల్లించడం జరుగుతుందన్నారు.

జిల్లాలోని బ్యాంకులు, సహకార శాఖ బ్యాంకులు, సహకార శాఖ సొసైటీల ద్వారా రైతులకు నేరుగా వారివారి ఖాతాల్లో రుణ మాఫీ సొమ్ము జమవుతుందని, ప్రతి బ్యాంకుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో, మండల స్పెషల్ ఆఫీసర్లను, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లను సంప్రదించేలా చర్యలు చేపట్టాలని అగ్రికల్చర్ అధికారులను ఆదేశించారు. రుణ మాఫీ కోసం వచ్చే రైతులకు పూర్తిగా సహకరిస్తూ.. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్యాంకర్లు, రెవెన్యూ, వ్యవసాయ, సహకార శాఖ అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఖరీఫ్, రబీకి సకాలంలో పంట రుణాలను అందించాలని బ్యాంకర్లను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కుసుమ, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రుణమాఫీపై బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

సమావేశంలో పాల్గొన్న పలు బ్యాంకుల అధికారులు

జిల్లాలో 46,633 మంది రైతులకు రూ.256.26 కోట్ల రుణ మాఫీ

వికారాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గైడ్ లైన్స్ ప్రకారం చేపట్టిన రైతు రుణ మాఫీ ద్వారా జమయ్యే రుణం రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా నేరుగా రైతులకు చేరేలా బ్యాంకర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు చర్యలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతగా వేల కోట్ల రుణ మాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 46,633 మంది రైతులకుగాను 256.26 కోట్ల రూపాయలు రైతులకు రుణ మాఫీ లభించనున్నదని పేర్కొన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతి రైతు వేదికలో రైతుల లిస్టు డిస్‌ప్లే చేయాలన్నారు. రైతులకు సంబంధించిన 1బీ, ఆధార్ కార్డు, భూమికి సంబంధించిన్ పాస్ పుస్తకం తదితర డాక్యుమెంట్స్ తీసుకొని రెన్యువల్ కోసం బ్యాంకుకు రావాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో కూడా రైతులకు సంబంధించి వివరాలతో కూడిన బ్యానర్లు ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. 30 రోజులపాటు వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉండి రైతు రుణమాఫీ రైతులకు చేరేలా చూడాలన్నారు. లిస్టులో రైతుల పేర్లు లేకపోతే జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రుణమాఫీ సహాయ కేంద్రం టోల్ ఫ్రీ నం. 9989291049, 9000470989లను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఎల్‌డీఎం యాదగిరి, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రాజు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , తెలంగాణ గ్రామీణ బ్యాంకు, కోఆపరేటివ్ బ్యాంకు, ఇతర బ్యాంకుల అధికారులున్నారు.

వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఇబ్రహీంపట్నం విద్యార్థులు

రంగారెడ్డి, జూలై 18 (నమస్తే తెలంగాణ) : రూరల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా హనుమకొండ రంగశాయిపేటలోని గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని వాసవి జూనియర్, ఒకేషనల్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈమేరకు గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంక ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్య ఎంత అవసరమో.. క్రీడలు కూడా అంతే అవసరమన్నారు. వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా ఖ్యాతిని చాటడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావ్, వాసవి కళాశాల డైరెక్టర్, కళాశాల ప్రిన్సిపాల్ మంగూలాల్, కాలేజీ వ్యాయామ ఉపాధ్యాయులు రవి, వాసవి కళాశాల క్రీడాకారులున్నారు.

జూలై 20 నుంచి ఏజెన్సీల నుంచి సీల్డ్ టెండర్ల స్వీకరణ

వికారాబాద్, జూలై 18 : వికారాబాద్ జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించి అవుట్ సోర్సింగ్ సర్వీసులు ఏర్పాటు చేసే నిమిత్తం రిజిస్ట్రేషన్ అయి ఉన్న అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల నుంచి సీల్డ్ టెండర్లు కోరుతున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ల డాక్యుమెంట్లను జిల్లా ఉపాధి కల్పనాధికారి నుంచి జూలై 26వ తేదీలోపు కార్యాలయ పని దినాల్లో పొందాలన్నారు. ఆసక్తికల ఏజెన్సీల నుంచి సీల్డ్ టెండర్లను జూలై 20 నుంచి 26వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. సీల్డ్ టెండర్లను జూలై 27న ఉదయం 10:30కి అందుబాటులో ఉన్న ఏజెన్సీల సమక్షంలో జిల్లా కలెక్టరేర్ సమావేశ మందిరంలో తెరవడం జరుగుతుందని వివరించారు. టెండర్ ఫారాలు, ఇతర సమాచారం కోసం జిల్లా ఉపాధి కల్పనాధికారి ఫోన్ నం.9177607016 ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

రుణమాఫీపై ఫిర్యాదుల స్వీకరణ

రంగారెడ్డి, జూలై 18 (నమస్తే తెలంగాణ) : పంట రుణమాఫీకి సంబంధించి ఏమైనా సందేహాలుంటే ఫిర్యాదు చేయవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయం పనిచేయు వేళల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 040-24547507ను సంప్రదించాల్సిందిగా సూచించారు.

మృతుడు హోంగార్డు బలవంత్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

వికారాబాద్, జూలై 18 : మోమిన్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన హోంగార్డు బలవంత్ కుటుంబసభ్యులకు హోంగార్డుల తరపున గురువారం వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నారాయణరెడ్డి ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ డెవిడ్ విజయ్, జిల్లా హోంగార్డుల అధ్యక్షుడు సుధాకర్, రాష్ట్ర హోంగార్డుల ఆర్గనైజేషన్ సెక్రటరీ చాంద్‌పాషా, ఇతర హోంగార్డు అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ నారాయణరెడ్డిని గురువారం వికారాబాద్ ప్రాంతానికి చెందిన హైకోర్టు అడ్వకేట్ రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్ ఉన్నారు.

రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను గురువారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న పరిగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్‌గుప్తా - పరిగి, జూలై 18

బీరోల్ రైతు సమస్యలపై విచారణ

బంట్వారం(కోట్‌పల్లి), జూలై 18 : మండల పరిధిలోని బీరోల్ గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ పొలాలకు వెళ్లే దారి విషయమై గతంలో ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశం మేరకు అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి గురువారం స్థానిక తహసీల్దార్ ఆశాజ్యోతి, ఆర్ఐ రమేశ్, ఇతర సర్వేయర్లతో కలిసి గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన పలువురు రైతుల పొలాలకు వెళ్లే దారిని కొందరు పట్టాదారులు ఆక్రమించారని, దారి లేకుండా చేశారన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను వెంటనే కలెక్టర్‌కు అందజేస్తామని ఆమె తెలిపారు.

బీరోల్ గ్రామంలో రైతులను విచారిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి

దావత్ పేరుతో హత్య చేశారు..

- బంగారు ఆభరణాలే లక్ష్యంగా హత్యకు పాల్పడిన నిందితులు
- వేములనర్వ గ్రామంలో వెలుగు చూసిన మహిళ హత్య వివరాలను వెల్లడించిన శంషాబాద్ డీసీపీ రాజేశ్

షాద్‌నగర్, జూలై 18 : బంగారు ఆభరణాలను ఎలాగైనా కాజేయాలనే దురుద్దేశంతో ఇద్దరు నిందితులు దావత్ పేరుతో మహిళను హత్య చేసి బంగారు ఆభరణాలను చోరీ చేసిన ఘటన కేశంపేట మండలం వేములనర్వ గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. మహిళ హత్య వివరాలను గురువారం శంషాబాద్ డీసీపీ రాజేశ్ షాద్‌నగర్ ఏసీపీ కార్యాలయంలో వెల్లడించారు. కేశంపేట మండలం బోధునంపల్లి గ్రామానికి చెందిన వెంకటాపురం పార్వతమ్మ(45) రోజువారీ కూలీగా జీవనోపాధి పొందుతున్నది. ఆమె భర్త అనారోగ్యంతో మృతిచెందగా.. పిల్లలు లేకపోవడంతో ఒంటరిగా జీవనం సాగిస్తున్నది. ఈ నేపథ్యంలో ఇటీవల తన వ్యవసాయ భూమిని విక్రయించి మహేశ్వరం మండలం కందుకూరు గ్రామంలో ఓ ఇల్లు, బంగారు అభరణాలను కొనుగోలు చేసింది. బోధునంపల్లి గ్రామంలో కొన్ని నెలల క్రితం ఓ వీధి నాటక ప్రదర్శనలో భాగంగా ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ గ్రామానికి చెందిన కుందేలు అంజమ్మ, కేశంపేట మండలం పోమాలపల్లి గ్రామానికి చెందిన పెబ్బె యాదయ్య కళాకారులకు రంగులు వేసేందుకు వచ్చారు. అక్కడే మూడ్రోజుల పాటు ఉన్నారు. ఆ సమయంలో పార్వతమ్మతో ఈ ఇద్దరికి పరిచయం ఏర్పడింది. తరువాత యాదయ్య ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకుని తరచూ కలుస్తుండేవాడు.

యాదయ్య, అంజమ్మలకు పార్వతమ్మ ఒంటిపైనున్న బంగారంపై కన్నుపడింది. ఎలాగైనా కాజేయాలని పథకం వేశారు. ఇందులో భాగంగానే ఈ నెల 12న దావత్ చేసుకుందామని వారు పార్వతమ్మను వేములనర్వగ్రామంలోని గుట్టరాళ్ల వద్దకు తీసుకెళ్లారు. అక్కడే మద్యం సేవించారు. ఈ క్రమంలో రూ.5వేలు కావాలని అంజమ్మ పార్వతమ్మను అడగడంతో ఆమె విభేదించింది. దీంతో పార్వతమ్మకు బాగా మద్యం తాగించి మత్తులోకి జారుకోగానే వారు బండరాయితో ఆమెను బలంగా కొట్టగా అక్కడిక్కడే మృతిచెందింది. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న బంగారుతాడు, చెవి కమ్మలు, చెవి పుల్లలు, ఒక జత కాళ్ల కడియాలు దొంగిలించారు. మృతురాలి ఫోన్ సిమ్‌కార్డు విరగ్గొట్టి చెట్ల పొదల్లో పడేసి వెళ్లారు. ఈ నెల 16న స్థానికులు గుర్తుతెలియని మహిళ మృతిచెందిందని పోలీసులకు చెప్పడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని వివరించారు. అనుమానం ఉన్న అంజమ్మ, యాదయ్యలను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారని తెలిపారు. నిందితులను అరెస్ట్‌చేసి రిమాండ్ తరలించినట్లు డీసీపీ పేర్కొన్నారు. కేసు ఛేదనలో పాటుబడ్డ ఏసీపీ రంగస్వామి, షాద్‌నగర్ రూరల్ సీఐ సత్యనారాయణ, కేశంపేట ఎస్ఐ రాజ్‌కుమార్, ఇతర పోలీస్ సిబ్బందిని అభినందించారు.

షాద్‌నగర్ ఏసీపీ కార్యాలయంలో కేసు వివరాలను వెల్లడిస్తున్న శంషాబాద్ డీసీపీ రాజేశ్

గురువారం చిలుకూరు ఆలయానికి వచ్చి ప్రదక్షిణలు చేస్తున్న ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు విశ్వక్‌సేన్ - మొయినాబాద్, జూలై 18

వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా అరుణ

వికారాబాద్, జూలై 18 : వికారాబాద్ ఆర్టీసీ డిపో నూతన మేనేజర్‌గా అరుణ బాధ్యతలు స్వీకరించారు. వికారాబాద్ డిపో మేనేజర్ భక్షీనాయక్ ఎస్‌వో ఉప్పల్ స్టోర్స్‌కు బదిలీపై వెళ్లగా, అతడి స్థానంలో బస్ భవన్ నుంచి ప్రమోషన్‌లో భాగంగా అరుణ వికారాబాద్ డిపో నూతన మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అరుణ మాట్లాడుతూ.. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో పూర్తి బాధ్యతగా ఉంటానన్నారు. ప్రతి ఉద్యోగికి ఎల్లవేళలా తన సహకారం ఉంటుందని, అందరూ టీమ్ వర్క్‌తో డిపో అభివృద్ధికి, సంస్థ మనుగడకు పాటుపడాలని సూచించారు.

పార్కులను థీమ్‌గా తీర్చిదిద్దాలి

క్షేత్రస్థాయి పర్యటనలో కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, జూలై 18 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలో చేపట్టిన వివిధ సివిల్ వర్క్స్ టెండర్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం జూబ్లీహిల్స్ సర్కిల్‌లో పర్యటించిన కమిషనర్.. లోటస్‌పాండ్, పాత్‌వే, మంగోలియా బేకరీ వద్ద ఉన్న పార్కును పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. లోటస్ పాండ్‌లోని సీవరేజీ కనెక్షన్లను తొలగించాలని, నాలాల్లో స్ట్రామ్ వాటర్, ఫ్లోటింగ్ మెటీరియల్ రాకుండా మెష్ ఏర్పాటు చేయాలని సూచించారు. దెబ్బతిన్న పాత్‌వేలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. మంగోలియా బేకరీ వద్ద నుంచి రోడ్ నం.44, 45 వరకు రోడ్డు, సీవరేజీ పనులు చేపట్టేందుకు సంబంధించిన సివిల్ వర్క్ టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. హైటెన్షన్ వైర్లు దిగువన ఉన్న అన్ని పార్కులను థీమ్ పార్కులుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని యూబీడీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఈఈ విజయ కుమార్, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. అలాగే జోనల్ కమిషనర్, అడిషనల్ కమిషనర్ యూసీడీ, హెల్త్, చీఫ్ ఎంటమాలజీ, కాల్ సెంటర్ ఓఎస్డీలతో కమిషనర్ ఆమ్రపాలి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రేటర్‌లో దోమల ఉత్పత్తి అయ్యే హాట్ స్పాట్‌లను గుర్తించి.. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డెంగీ వ్యాధి నివారణలో భాగంగా పాఠశాల, కాలేజీల్లో చేపట్టే అవగాహన కార్యక్రమాలను వెంటనే పూర్తి చేసి, హాట్ స్పాట్‌లపై దృష్టి సారించాలన్నారు. ఈఎంఐ పూర్తిచేసిన స్వచ్ఛ ఆటో యజమాని సక్రమంగా హాజరు కాకుండా నిర్దేశించిన ప్రకారం చెత్త సేకరణ చేయకపోతే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన జీవీపీల తొలగింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

టీబీపై సీసీఎంబీ అధ్యయనం

సిటీబ్యూరో, జూలై 18 (నమస్తే తెలంగాణ) : టీబీపై సీసీఎంబీ పరిశోధనలు ముమ్మరం చేసింది. వ్యాధి నియంత్రణే లక్ష్యంగా కొంత కాలంగా టీబీ బ్యాక్టీరియా జీవక్రియలను పరిశోధిస్తున్నారు. మైక్రో బ్యాక్టీరియం ట్యూబరోక్యూలోసిస్ వల్ల ఊపిరితిత్తులు ఏ విధంగా ప్రభావితమవుతున్నాయి..? మానవ రోగ నిరోధకతను ఏ విధంగా తట్టుకుంటున్నాయి..? ఆ విషయాలను తెలుసుకునేందుకు ఈ పరిశోధనలు చేస్తున్నట్లు సీసీఎంబీ వర్గాలు వెల్లడించాయి. అత్యంత క్లిష్టమైన, అతి సున్నితమైన ఊపిరితిత్తుల్లోని అంతర భాగాలను నిర్వీర్యం చేయడంలో ఈ బ్యాక్టీరియా వేగంగా తమ రూపాన్ని మార్చుకుంటున్నదని, అదే సమయంలో రోగనిరోధకతను తట్టుకునేలా బలోపేతంగా మారుతున్నదని గుర్తించారు. అందుకే తమ పరిశోధనల్లో అత్యంత సంక్లిష్టమైన చికిత్స విధానాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే ఈ పరిశోధనలు కొంత కాలంగా సాగుతున్నాయని, వచ్చే ఏడాదిలో జాతీయస్థాయిలో పరిశోధన బృందం ఆధ్వర్యంలో జరిగే ఈఎంబీవో సమావేశంలో టీబీ నియంత్రణ, అధ్యయన తీరు తెన్నులపై చర్చించనున్నట్లు సీసీఎంబీ వర్గాలు పేర్కొన్నాయి.

600 మిలియన్ యూనిట్లు!

- ఆగస్టు 2020 నుంచి ఇప్పటి వరకు 17.7 లక్షల టన్నుల వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి
- 'వెల్త్ ఆఫ్ వేస్ట్'ను సృష్టించడంలో దూసుకుపోతున్న బల్దియా

సిటీబ్యూరో, జూలై 18 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ప్రభుత్వంలో తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయాలు నేడు అద్భుత ఫలితాలను ఇస్తున్నది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, విధానాల అమలుతో వ్యర్థాల నుంచి సంపద (వెల్త్ ఆఫ్ వేస్ట్)ను సృష్టించడంలో జీహెచ్ఎంసీ దూసుకుపోతున్నది. జవహర్‌నగర్ ఫేజ్-1లో 24 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. ఆగస్టు 2020 నుంచి ఇప్పటి వరకు 17.6 లక్షల టన్నుల చెత్త నుంచి 600 మిలియన్ యూనిట్ల కరెంట్ ఉత్పత్తి కావడం గమనార్హం. ఆరు కేంద్రాల ద్వారా 101 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకోగా, జవహర్‌నగర్, దుండిగల్ (15 మెగావాట్ల ప్లాంటు అందుబాటులోకి వచ్చింది) ఈ ఏడాది చివరి నాటికి జవహర్‌నగర్ ఫేజ్-2 (24 మెగావాట్ల), ఫ్యారానగర్(12), యాచారం (12), బీబీనగర్ (11) కేంద్రాలు అందుబాటులోకి రావాల్సి ఉన్నది. కాగా, రోజుకు జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు జంటనగరాల నలుమూలల నుంచి 7760 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తరలిస్తుండగా, 3768 మెట్రిక్ టన్నుల పొడి చెత్తను వేరే చేసి కరెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. 579 లీచెడ్ వ్యర్థాలు, 1165 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్, 336 మెట్రిక్ టన్నుల సేంద్రియ ఎరువు బయటకు వస్తున్నది.

1600 టన్నుల చెత్తను..

వ్యర్థాల నుంచి విద్యుదుత్పత్తి చేయడంలో జీహెచ్ఎంసీ మెరుగైన ఫలితాలను రాబడుతున్నది. వాతావరణ కాలుష్యానికి కారణమైన వ్యర్థాలను వెలుగులిచ్చే ముడిసరుకుగా మార్చారు. జవహర్‌నగర్ వద్ద ప్లాంటు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి నిత్యం 1500-1600 టన్నుల చెత్తను రెండు బాయిలర్లలో వేస్తున్నారు. దాని నుంచి వచ్చే మంటలు నీటిని మరిగించి.. ఆవిరిని ఉత్పత్తి చేస్తుంది. ఆవిరి ద్వారా టర్బయిన్లు వేగంగా తిరిగి విద్యుదుత్పత్తి అవుతుంది. మొదటి ప్లాంటును పూర్తిస్థాయిలో నడిపి 50 శాతం ఉత్పత్తి చేయగా, ప్రస్తుతం 65 శాతానికి పెంచారు.

ఆ రెండు ప్లాంట్ల ద్వారా..

చెత్తను జవహర్ నగర్ డంప్ యార్డుకు తరలించే ప్రక్రియను సమగ్ర మున్సిపల్ ఘన పదార్థాల నిర్వహణ ప్రాజెక్టుగా పరిగణిస్తారు. ఇందులో భాగంగానే జవహర్ నగర్ ప్లాంట్-1, దుండిగల్ ప్లాంట్ ద్వారా ఇప్పటికే 39 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తిలో భాగంగా ఇంటింటి నుంఛజ సేకరించిన చెత్తను సెకండరీ కలెక్షన్, ట్రాన్స్‌ఫర్ పాయింట్స్ (ఎస్‌సీటీపీ) నుంచి వ్యర్థాలను జవహర్‌నగర్ డంప్ యార్డుకు తరలిస్తారు. తరలించిన వెంటనే అక్కడ యాంత్రికంగా సెగ్రిగేట్ చేసిన తర్వాత మండే గుణం గల వ్యర్థాలను వేరు చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

జీవో 567ను రైతు రుణమాఫీకి అనుకూలంగా సవరించాలి

పరిగి, జూలై 18 : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 567ను రైతుల రుణమాఫీకి అనుకూలంగా సవరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. రైతుల రుణమాఫీకి రూపొందించిన నిబంధనల్లో ఉన్న కొన్ని అంశాలను సవరించి రూ.2లక్షల వరకు రుణం పొందిన రైతులకు లబ్ధి చేకూరేలా చేయాలని కోరారు. గురువారం పరిగిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జీవో ప్రకారం రేషన్‌కార్డు ఆధారంగా ఉన్న వారందరినీ ఒకే కుటుంబంగా పరిగణించి, కుటుంబంలో ఒక వ్యక్తికే రుణమాఫీ వర్తింపజేయడం వల్ల విడిపోయి వేర్వేరుగా ఉంటున్నవారికి రుణమాఫీ వర్తించడంలేదన్నారు. ఆధార్‌కార్డు, పాస్‌బుక్, రేషన్‌కార్డు లేని కుటుంబాలు అనేకం ఉంటాయన్నారు. పాసు పుస్తకాల కోసం 12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్లు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయని.. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నవారు లక్షల సంఖ్యలో ఉన్నారని తెలిపారు. వ్యవసాయం కోసం రుణం తీసుకున్న సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లు, జాయింట్ లయాబిలిటీ గ్రూప్, రైతు మిత్ర గ్రూప్, కౌలుదారులకు ఇచ్చిన లోన్ ఎలిజిబిలిటీ కార్డు ఉన్నవారికి రుణమాఫీ వర్తించదని ప్రకటించారన్నారు. ఈ నాలుగు గ్రూపుల్లో అత్యంత పేదలు దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల వారేనన్నారు. కానీ జీవో సవరించడం ద్వారా అందరికీ రుణమాఫీ వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్యయ్య, రఘురాం, సీహెచ్ సత్యయ్య, వెంకటయ్య, అనంతయ్య, నర్సింహులు పాల్గొన్నారు.